క్లుప్తంగా

రేపు వీర బ్రహ్మేంద్రస్వామి దేవాలయంలో హోమాలు

చిలుకూరు: విశ్వకర్మ భగవాన్ జయంతి సందర్భంగా చిలుకూరు గ్రామ పరిధిలోని కవితా కళాశాల సమీపంలో గల వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయ ఆవరణలో మంగళవారం ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించనున్నట్లు ఆలయ మఠాధిపతులు పమ్మి బ్రహ్మయాచారి ఆదివారం తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

బీసీలకు సామాజిక న్యాయం జరగాలి


మాట్లాడుతున్న ధనుంజయనాయుడు

నేరేడుచర్ల: బీసీలకు సామాజిక న్యాయం జరగాలని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు ధనుంజయనాయుడు అన్నారు. ఆదివారం నేరేడుచర్లలో ఆయన మాట్లాడుతూ.. దేశ జనాభాలో 56శాతం ఉన్న బీసీలకు ఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా ఎలాంటి న్యాయం చేయడం లేదని ఆరోపించారు. బీసీలు రుణాల కోసం దరఖాస్తు చేసుకుంటే నేటికీ అందించలేదన్నారు. సమావేశంలో సంఘం నాయకులు చిలకరాజు శ్రీను, కొట్టు బాబు, కంబాల శ్రీనివాస్, గురువయ్య, ధనమ్మ తదితరులున్నారు.

ఆవుల పిచ్చయ్యకు నివాళి


పిచ్చయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

గరిడేపల్లి: సీపీఎం సీనియర్ నాయకుడు ఆవుల పిచ్చయ్య సేవలు మరువలేనివని సీపీఎం నాయకులు బొల్లెపల్లి శ్రీనివాస్, సుందర వీరరాఘవయ్య అన్నారు. ఆదివారం గరిడేపల్లి మండల పరిధిలోని కీతవారిగూడెం సీపీఎం గ్రామ శాఖ ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయంలో ఆవుల పిచ్చయ్య వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో భూతం నాగరాజు, జుట్టుకొండ మట్టయ్య, పాలిల్లి రాఘవులు, ఆవుల సైదులు, ఇండ్ల వెంకటేష్, వెంకన్న, పెండెం శేఖర్, జుట్టుకొండ శ్రీను, బంగారు రాజేష్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మాస్‌లైన్ పార్టీలో చేరిక

భానుపురి (సూర్యాపేట) : పట్టణంలోని సుందరయ్యనగర్ కు చెందిన బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు మాస్ లైన్ పార్టీ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి శివకుమార్ సమక్షంలో ఆదివారం ఆ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా కొత్తపల్లి శివకుమార్ మాట్లాడుతూ సూర్యాపేట జిల్లాలో మాస్‌లైన్ పార్టీ చేస్తున్న ప్రజా పోరాటాలను చూసి ప్రజలు పార్టీ వైపు ఆకర్షితులు అవుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో శేషగిరి వెంకన్న, సైదులు, ఆనందు, రేణుక, పున్నమ్మ, రాజేశ్వరి, పరుశురాం, రమేష్, సరస్వతి, కొత్తపల్లి రేణుక, కార్మికుల వెంకన్న, ఎర్ర అఖిల్, నాగన్న పాల్గొన్నారు.

నేడు కంటి వైద్య శిబిరం

భానుపురి (సూర్యాపేట) : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం సూర్యాపేట కార్యాలయంలో సోమవారం వరంగల్‌కు చెందిన శరత్ మాక్సి విజన్ లేజర్ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు శ్యాంసుందర్ రెడ్డి, సుధ గాని నాగేశ్వరరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు నిర్వహించే వైద్య పరీక్షలకు పెన్షనర్లు, ఆరోగ్యశ్రీ కార్డు కలవారు, జర్నలిస్టులు తమ హెల్త్ కార్డులను వెంట తెచ్చుకొని వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సెప్టెంబర్ 17 ముమ్మాటికీ విద్రోహ దినమే

ఆత్మకూరు (ఎస్) (సూర్యాపేట): సెప్టెంబర్ 17 ముమ్మాటికి విద్రోహ దినమే అని ఐఎఫ్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి గంటా నాగయ్య అన్నారు. సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో మండల పరిధిలోని ఆత్మకూర్, పాత సూర్యాపేట, తుమ్మల పెన్‌పహాడ్, బొప్పారం గ్రామాల్లో తెలంగాణ సాయుధ పోరాటంలో అమరులైన వీరులకు నివాళులు అర్పించి, మౌనం పాటించారు.

రేషన్ బియ్యం రాలే!

- కోదాడ నియోజకవర్గంలో 14 షాపులకు చేరని బియ్యం
- స్టేజ్‌- 1 నుంచే బియ్యం సరఫరా కాలేదంటున్న గోదాం అధికారులు
- దుకాణాల చుట్టూ కాళ్లు అరిగేలా తిరుగుతున్న లబ్ధిదారులు



చిలుకూరు: ప్రతి నెలా రెండు, మూడో తేదీలోపు రేషన్ షాపులకు చేరాల్సిన బియ్యం నేటికీ సరఫరా కాలేదు. దీంతో ఆయా గ్రామాల పరిధిలోని రేషన్ లబ్ధిదారులు బియ్యం రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రేషన్ షాపులకు వస్తున్న లబ్ధిదారులకు బియ్యం లేవు అని చెప్పడంతో తిరిగి వెళ్లిపోతున్నారు. బియ్యం సమయానికి రాకపోవడంతో డీలర్లకు సైతం తిప్పలు తప్పడం లేదు. వాస్తవంగా లబ్ధిదారులకు ప్రతి నెలా 20వ తేదీ లోపే బియ్యం పంపిణీ చేస్తారు. ఈ నెలలో ఇప్పటివరకు రేషన్ షాపులకే బియ్యం సరఫరా కాలేదు.

కోదాడ గోదాంలో స్టాక్ లేదు..

నియోజకవర్గ వ్యాప్తంగా 146 రేషన్ షాపులు ఉండగా వీటిల్లో 14 రేషన్ షాపులకు రేషన్ బియ్యం సరఫరా కాలేదు. చిలుకూరు మండల పరిధిలోని పోలేనిగూడెం, ఆర్లెగూడెం, చెన్నారిగూడెం, ఆచార్యుల గూడెం రేషన్ షాపులకు సరఫరా కాలేదు. అలాగే కోదాడ మండలం, పట్టణ పరిధిలో గుడిబండ గ్రామంలో రెండు షాపులకు, దోరకుంట గ్రామంలో రెండు షాపులకు, చిమిర్యాల, మంగళతండా, కోదాడ పట్టణ పరిధిలో మూడు షాపులు, అనంతగిరి మండల పరిధిలో గోండ్రియాల గ్రామానికి రేషన్ బియ్యం సరఫరా కాలేదు. స్టేజ్‌- 1 గోదాముల నుంచి స్టేజ్ -2 కోదాడ రేషన్ గోదాములకు బియ్యం వస్తాయి. అక్కడి నుంచి ప్రతి నెలా రేషన్ షాపులకు బియ్యం సరఫరా అవుతాయి. అయితే ఈ నెల స్టేజ్ - 1 నుంచే సరిపడా బియ్యం సరఫరా కాలేదని, అందుకే 14 రేషన్ షాపులకు బియ్యం సరఫరా చేయలేదని గోదాం అధికారులు పేర్కొంటున్నారు. కోదాడ గోదాంలో రేషన్ బియ్యం స్టాక్ లేదని తెలిసింది.

వైభవంగా ప్రారంభమైన ముత్యాలమ్మ జాతర



ప్రభల ఊరేగింపులో పాల్గొన్న గ్రామస్తులు

హుజూర్‌నగర్: హుజూర్‌నగర్‌లో ఆదివారం ముత్యాలమ్మ జాతర ప్రారంభమైంది. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేకపూజలు నిర్వహించారు. ప్రభలతో పురవీధుల్లో ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ పూజారులు, ఉత్సవ కమిటీ సభ్యులు, ప్రజా ప్రతినిధులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు. జాతర సందర్భంగా పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.


అమ్మవారి దర్శనానికి వచ్చిన భక్తులు

గ్రామాల్లో కుంటుపడుతున్న అభివృద్ధి


మాట్లాడుతున్న ఎస్కే యాకూబ్

గరిడేపల్లి: గ్రామ అభివృద్ధి కుంటుపడుతోందని, స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని సీపీఎం మండల కార్యదర్శి ఎస్కే యాకూబ్ డిమాండ్ చేశారు. ఆదివారం గరిడేపల్లి మండల పరిధిలోని అబ్బిరెడ్డిగూడెం గ్రామంలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. గ్రామాల్లో సర్పంచ్‌లు లేక పారిశుద్ధ్యం పడకేసిందన్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కొన్ని గ్రామాల్లో తాగునీటి పైపులైన్లు లీకేజీ అయి డ్రైనేజీ వాటర్ కలుస్తున్నాయన్నారు. గ్రామాల అభివృద్ధికి అధికారులు బాధ్యతాయుతంగా పనిచేసి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పందిరి వీరారెడ్డి, రేపూరి తిరపయ్య, చిలక గాలయ్య, వీరస్వామి, కోట సైదయ్య, నాగలి పుల్లమ్మ, చినపంగు వెంకన్న, భిక్షమారెడ్డి పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే మందుల సామేలు

అర్వపల్లి: నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్నట్లు తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు పేర్కొన్నారు. జాజిరెడ్డిగూడెం మండల కేంద్రంలో ఆదివారం రాత్రి వివిధ వార్డుల్లో పర్యటించి మాట్లాడారు. గ్రామాల్లో అపరిష్కృతంగా ఉన్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ప్రధానంగా రోడ్ల సమ్యలను పరిష్కరించనున్నట్లు తెలిపారు. గోదావరి జలాలు కూడా త్వరలో రానున్నాయని చెప్పారు. ఈ సందర్భంగా కాంగ్రెస్‌పార్టీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి గుడిపల్లి మధుకర్‌రెడ్డి, పీఏసీఎస్ మాజీ చైర్మన్ గుడిపల్లి వెంకట్‌రెడ్డి, దాసరి సోమయ్య, నర్సింగ వెంకటేశ్వర్లు గౌడ్, కుంభం మధు, బింగి కృష్ణమూర్తి, జలేందర్, బైరబోయిన మహారాజు, ఎల్గెంల కొమిరెల్లి, కుంభం సత్తయ్య, విక్రం పాల్గొన్నారు.

సూర్యనారాయణస్వామి క్షేత్రంలో ప్రత్యేక పూజలు

అర్వపల్లి: జాజిరెడ్డిగూడెం మండలం తిమ్మాపురంలోని అఖండజ్యోతి స్వరూప సూర్యనారాయణస్వామి క్షేత్రంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజామున ఉషాపద్మిని ఛాయసమేత సూర్యనారాయణస్వామిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు జరిపించారు. అనంతరం యజ్ఞశాలలో మహాసౌరహోమాన్ని నిర్వహించారు. అదేవిధంగా క్షేత్ర ఆవరణలోని కార్యసిద్ధి వీరహనుమాన్, శ్రీరామకోటి స్థూపాలను కూడా భక్తులు దర్శించుకున్నారు. మధ్యాహ్నం అన్నప్రసాదసత్రంలో ఆదిత్య సేవా కేంద్రం ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో క్షేత్ర వ్యవస్థాపకుడు, సౌర ఆరాధకులు జనార్దన్‌స్వామి, గణపురం నరేష్, బీరవోలు ఇంద్రారెడ్డి, అర్చకులు వికాస్‌పాండే, శ్రీరాంపాండే, అంకిత్‌పాండే, భక్తులు పాల్గొన్నారు.

క్షేత్రాన్ని సందర్శించిన ఇంటలిజెన్స్ సీఐ

జిల్లా ఇంటలిజెన్స్ సీఐ ప్రభాకర్ దంపతులు ఆదివారం క్షేత్రాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. క్షేత్ర విశిష్టతను క్షేత్ర వ్యవస్థాపకుడు జనార్దన్‌స్వామి తెలియజేశారు. ఈ సందర్భంగా సీఐ దంపతులను సన్మానించారు.


సూర్యక్షేత్రంలో పూజలు చేస్తున్న భక్తులు

ఎస్సీ వర్గీకరణ అంశం ముందుకు తీసుకెళ్లాలి

నడిగూడెం: ఎస్సీ వర్గీకరణ అంశాన్ని ముందుకు తీసుకెళ్లాలని ఎస్సీ వర్గీకరణ కమిటీ చైర్మన్‌గా నియామకమైన రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డికి ఆదివారం కాగితరామచంద్రాపురంలో ఎంఎస్ఎఫ్ నాయకులు వినతిపత్రం అందజేశారు. వారిలో ఓయూ జేఏసీ కన్వీనర్ గంటెపంగు నాగరాజు, ఎంఎస్ఎఫ్ జిల్లా కన్వీనర్ పందిటి నవీన్ కుమార్, శ్యామ్, వెంకటేశ్వర్లు తదితరులున్నారు.

సీతారాం ఏచూరికి ఘన నివాళి


ఏచూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

హుజూర్‌నగర్‌రూరల్: హుజూర్‌నగర్ మండల పరిధిలోని శ్రీనివాసపురంలో ఆదివారం సీపీఎం జాతీయ నేత సీతారాం ఏచూరి చిత్రపటానికి ఆ పార్టీ నాయకులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఏచూరి మరణం సీపీఎం పార్టీకి తీరని లోటు అని అన్నారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి పోషబోయిన హుస్సేన్, మండల కమిటీ సభ్యురాలు తంగెళ్ల వెంకటచంద్ర, గోపరాజు, నర్సింహాచారి, శ్రీనివాస్, కృష్ణారావు, బిందు, మల్లమ్మ, గోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో ప్రాజెక్టులు నిండుగా ఉన్నాయి


ముత్యాలమ్మ ఆలయం వద్ద మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్

- మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి

హుజూర్‌నగర్: భగవంతుడి దయతో రాష్ట్రంలోని అన్ని ప్రాజెక్టులు నిండుగా ఉన్నాయని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి అన్నారు. ఆదివారం హుజూర్‌నగర్‌లో ముత్యాలమ్మ జాతర సందర్భంగా అమ్మవారిని ఆయన దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈసందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మంత్రికి స్వాగతం పలికి పూలమాలతో సన్మానించారు. రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని పంటలు పండాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు. ముత్యాలమ్మ ఆలయ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గెల్లి అర్చనరవి, వైస్ చైర్మన్ కోతి సంపత్‌రెడ్డి, నాయకులు యరగాని నాగన్న, తన్నీరు మల్లిఖార్జున్, దొంతగాని శ్రీనివాస్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.


మహారుద్రాభిషేకం పోస్టర్లు ఆవిష్కరిస్తున్న మంత్రి ఉత్తమ్, నిర్వాహకులు

మహా రుద్రాభిషేకం గొప్ప ఆధ్యాత్మిక కార్యక్రమం

హుజూర్‌నగర్: హుజూర్‌నగర్‌లో వచ్చే నెలలో నిర్వహించనున్న మహా రుద్రాభిషేకం గొప్ప ఆధ్యాత్మిక కార్యక్రమమని రాష్ట్ర నీటి పారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. ఆదివారం హుజూర్‌నగర్ పట్టణంలోని ముత్యాలమ్మ ఆలయం వద్ద మహా రుద్రాభిషేకం కరపత్రాలు, వాల్ పోస్టర్లను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గెల్లి అర్చన రవి, వైస్ చైర్మన్ కోతి సంపత్ రెడ్డి, ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యరగాని నాగన్న, మహారుద్రాభిషేకం నిర్వాహకులు గజ్జి ప్రభాకర్, ఓరుగంటి నాగేశ్వర్ రావు, కీత మల్లికార్జున్, గుండా శ్రీను, కన్నెగుండ్ల అశోక్, కీతా సుధాకర్, ఎడ్ల విజయ్, చిట్యాల అమర్‌నాథ్ రెడ్డి, గుండా ఫణికుమారి తదితరులు పాల్గొన్నారు.

మంత్రికి స్వాగతం

నడిగూడెం: మండలంలోని కాగితరామచంద్రాపురం వద్ద సాగర్ కాల్వ మరమ్మతుల పరిశీలనకు రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వచ్చారు. ఈమేరకు మోతె మండలం మామిళ్లగూడెం టోల్ గేట్ వద్ద ఆయనకు కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ పుష్పగుచ్ఛం అందజేసి ఘనంగా స్వాగతం పలికారు. కార్యక్రమంలో తహసీల్దార్ సరిత, ఎంపీడీఓ ఎస్‌డీ ఇమామ్, మాజీ ఎంపీపీ యాతాకుల జ్యోతి, మాజీ జెడ్పీటీసీ బాణాల కవిత, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బుత్కూరి వెంకటరెడ్డి, ప్రధాన కార్యదర్శి వేపూరి సుధీర్, నాయకులు నాగిరెడ్డి లింగారెడ్డి, దేవబత్తిని రమేష్ ప్రసాద్, గడ్డం మల్లేష్, మంచికంటి వెంకటరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ మండల నాయకుల ఆధ్వర్యంలో..

మోతె: నడిగూడెం, హుజూర్‌నగర్ నియోజకవర్గాల్లో పంటలు నష్టపోయిన రైతుల పొలాలు, గండి పడిన కాల్వను పరిశీలించేందుకు ఆదివారం మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వచ్చారు. ఈసందర్భంగా మోతె మండల పరిధిలోని మామిళ్లగూడెం టోల్‌గేట్ వద్ద ఆయనకు కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు శాలువాలు కప్పి స్వాగతం పలికారు. వారిలో పార్టీ మండల అధ్యక్షుడు కీసర సంతోష్‌రెడ్డి, ముదిరెడ్డి మధుసూదన్‌రెడ్డి, సామ చినవెంకటరెడ్డి, మాత్రు నాయక్, నూకల మధుసూదన్‌రెడ్డి, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.


మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి మొక్క అందజేస్తున్న కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

సాయుధ పోరాటానికి కమ్యూనిస్టులే నిజమైన వారసులు


సీపీఎం జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు

మోతె: తెలంగాణ సాయుధ పోరాటానికి నిజమైన వారసులు కమ్యూనిస్టులేనని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు మట్టిపెల్లి సైదులు అన్నారు. తెలంగాణ సాయుధ పోరాటాల వారోత్సవాల సందర్భంగా ఆదివారం మోతె మండల పరిధిలోని రాఘవాపురం ఎక్స్ రోడ్డులో తెలంగాణ సాయుధ పోరాట యోధుడు బత్తిని పెంటయ్య చిత్ర పటానికి నివాళులర్పించారు. సీపీఎం జెండాను మండల కార్యదర్శి ముల్కూర్ గోపాల్‌రెడ్డి ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు గుంటగాని ఏసు, కిన్నెర పోతయ్య, నాగం మల్లయ్య, లచ్చిరాం, దోసపాటి శ్రీను, మల్లయ్య, మల్సూర్ పాల్గొన్నారు.

గణనాథుడికి పూజలు.. అన్నదానాలు


కోదాడలోని నయానగర్‌లో వినాయకుడి మండపం వద్ద దీపాలు వెలిగిస్తున్న మహిళలు

కోదాడ: గణనాథుడి నవరాత్రోత్సవాల్లో భాగంగా గణేశ్ మండలపాల వద్ద ఆదివారం అన్నదానం నిర్వహించారు. పలు విగ్రహాలను చెరువుల్లో నిమజ్జనం చేశారు.

భక్తిభావాన్ని పెంపొందించుకోవాలి

గరిడేపల్లి: ప్రతి ఒక్కరూ భక్తిభావాన్ని పెంపొందించుకోవాలని పీసీసీ ఆర్గనైజింగ్ సెక్రటరీ కటికం ఆశా రమేష్, పార్టీ మండల అధ్యక్షుడు త్రిపురం అంజన్ రెడ్డి అన్నారు. ఆదివారం గరిడేపల్లి మండల పరిధిలోని రామచంద్రాపురం గ్రామంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం వద్ద నిర్వాహకులు ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని వారు ప్రారంభించారు. కార్యక్రమంలో మూలగుండ్ల సీతారామరెడ్డి, గుండు రామాంజిగౌడ్, ఆరెపూరి నారాయణ, చామకూరి గురుస్వామి, మంగ, ప్రభాకర్, నక్క వెంకన్న, నందిపాటి రాజేష్, మచ్చ హుస్సేన్, మామిడి నాగరాజు, చిత్తలూరు మహేష్ తదితరులు పాల్గొన్నారు.

నేరేడుచర్లలో గణనాథుడి శోభాయాత్ర

నేరేడుచర్ల: నేరేడుచర్లలోని ఎస్ఆర్‌కే అపార్ట్‌మెంట్ లో ఏర్పాటు చేసిన గణనాథుడిని ఆదివారం నిమజ్జనం చేశారు. లడ్డూ వేలంలో రాంశెట్టి రాంబాబు రూ.72వేలకు దక్కించుకున్నారు. కార్యక్రమంలో జిల్లా ఆర్యవైశ్య సంఘం ఉపాధ్యక్షులు భువనగి అంజయ్య, రాచకొండ శ్రీనివాస్‌రావు, వాసవి క్లబ్ జోన్ చైర్మన్ కొత్త లక్ష్మణ్ పాల్గొన్నారు.

మోతె: మండలంలోని బీక్యతండా, సర్వారంతో పాటు పలు గ్రామాల్లో ఆదివారం వినాయక మండపాల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు అన్నదానం చేశారు. ఆయా కార్యక్రమాల్లో కిసాన్ కాంగ్రెస్ కోఆర్డినేటర్ ముదిరెడ్డి మధుసూదన్‌రెడ్డి, పులి ఈదయ్య, భాస్కర్, స్వామి, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.


చిలుకూరు: నారాయణపురంలో అన్నదానం నిర్వహిస్తున్న దాతలు, కమిటీ సభ్యులు


కోదాడలోని మదర్ థెరిస్సాస్కూల్ బజార్‌లో అన్నదానం నిర్వహిస్తున్ననిర్వాహకులు


గరిడేపల్లి: రామచంద్రాపురంలో అన్నదానం నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు


మఠంపల్లి: మట్టపల్లి వద్ద కృష్ణానదిలో వినాయక విగ్రహాన్ని నిమజ్జనం చేస్తున్న నిర్వాహకులు


కోదాడ: శ్రీమన్నారాయణ కాలనీలో వినాయకుడిని నిమజ్జనానికి తరలిస్తున్న భక్తులు

ప్రమాదకరంగా మూలమలుపులు


బుర్కచర్ల- హుస్సేన్‌బాద్ వద్ద ప్రమాదకరంగా ఉన్న మూలమలుపు

- ఏర్పాటు చేయని ప్రమాద హెచ్చరిక బోర్డులు
- నిత్యం ప్రమాదాలు

మోతె: మండల కేంద్రంతో పాటు పలు గ్రామాలకు వెళ్లే రహదారుల్లో ప్రమాదకరమైన మూల మలుపులు ఉన్నాయి. సూచికబోర్డులు కూడా లేకపోవడంతో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. మోతె- సిరికొండ, రావిపహాడ్ గ్రామాలకు వెళ్లే రోడ్డులో 10 అతి ప్రమాదకరమైన మూలమలుపులు ఉన్నాయి. అదేవిధంగా హుస్సేన్‌బాద్- బుర్కచర్లకు వెళ్లే రోడ్డులో, విభళాపురం - కరక్కాయలగూడెం, విభళాపురం - బుర్కచర్ల, ఉర్లుగొండ-నర్సింహాపురం, తుమ్మగూడెం, నేరడవాయి, గోపతండాకు వెళ్లే రోడ్డు మార్గంలో మూలమలుపులు అతి ప్రమాదకరంగా మారాయి. ఈ రోడ్డులో వాహనదారులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని ప్రయాణం సాగించాల్సిందే.

హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలి

మండల కేంద్రం నుంచి గ్రామాలకు వెళ్లే లింకు రోడ్డులో అతి ప్రమాదకరమైన మూలమలుపులు ఉన్నాయి. వీటి వద్ద హెచ్చరిక బోర్డులు కూడా ఏర్పాటు చేయకపోవడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. అధికారులు స్పందించి సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలి.

– కోట మధుసూదన్‌రెడ్డి


సిరికొండ- మోతె రహదారిలో.